క్లుప్తంగా

జెడ్పీ పాఠశాలకు క్రీడా పరికరాల అందజేత



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి బాలికోన్నత పాఠశాలకు చుక్కపల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.లక్ష విలువైన క్రీడా పరికరాలు శనివారం అందజేశారు. ట్రస్ట్ సభ్యులు చుక్కపల్లి సుధా మాట్లాడుతూ విద్యార్థులు దాతల సహకారం సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో ఎదగాలన్నారు. తల్లిదండ్రులను గౌరవించడం, క్రమశిక్షణ, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత, జీవిత లక్ష్యం నిర్దేశించుకోవడం, పాజిటివ్ దృక్పథం కలిగి ఉన్న విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరతారన్నారు. మైక్‌సెట్, హ్యాండ్‌బాల్ గోల్ పోస్ట్, క్రీడా పరికరాలు హెచ్‌ఎం పద్మలతకు అందజేశారు.

కర్రి బాబురెడ్డికి ఘన నివాళి



మైలవరం: పట్టణానికి చెందిన ప్రముఖులు, వైఎస్సార్ సీపీ అభిమాని కర్రి బాబురెడ్డి సంస్మరణ సభ శనివారం స్థానిక సీఎంఆర్ కల్యాణ మండపంలో జరిగింది. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ బాబురెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ గంగాధర రావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



విస్సన్నపేట: స్థానిక ప్రాథమిక పాఠశాల మొయిన్ ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీడీఓ వెంకటరమణ శనివారం పరిశీలించారు. సచివాలయ ఉద్యోగులను ఇన్‌చార్జిలుగా నియమించి అంగన్‌వాడీ కేంద్రాలు తెరిచినట్లు పేర్కొన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి నివాళి



తిరువూరు: రోడ్డుప్రమాదంలో మృతిచెందిన ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీకి తిరువూరు జనవిజ్ఞాన వేదిక సభ్యులు శనివారం నివాళులర్పించారు. స్థానిక సుందరయ్య భవన్లో సాబ్జీ చిత్రపటానికి జేవీవీ జిల్లా కార్యదర్శి గంగాధర్, స్థానిక ప్రతినిధులు పాపారావు, రాంప్రదీప్, హరికృష్ణ, సుదర్శన్, సుధాకర్, శోభన్‌బాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

సీపీఎం నాయకుడు మల్లెల మృతి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లికి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు మల్లెలసాంబశివరావు (74) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. 40 ఏళ్లుగా సీపీఎంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. సీపీఎం, సీఐటీ యూ నాయకులు ఎం.మహేష్, ఆలేటి విఠల్‌రావు, పి.కామేశ్వరరావు, బాబ్జి, కొండలరావు ఆయన మృత దేహానికి నివాళులర్పించారు.

జాతీయస్థాయి పోటీలకు హీల్ విద్యార్థిని ఎంపిక



ఆగిరిపల్లి: అండర్-14 జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు తోటపల్లిలోని హీల్ పాఠశాల విద్యార్థిని చెగిరెడ్డి హిమవర్షిని ఎంపికైనట్టు పాఠశాల హెచ్‌ఎం సాయిబాబా తెలిపారు. జనవరి 5వ తేదీ నుంచి రాంచీలో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటుందని తెలిపారు.

నేటి నుంచి ధనుర్మాస ప్రత్యేక పూజలు

ముసునూరు: ఆదివారం నుంచి ధనుర్మాసం సందర్భంగా లోపూడిలోని కోదండరామాలయం, గోపవరం నాగేంద్రస్వామి దేవస్థానం వద్ద ప్రతి తెల్లవారుజామున ప్రత్యేక అష్టోత్రాలు, పూజాదికాలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకులు కిరణ్‌కుమార్, చిట్టిబాబు శనివారం తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

పంచాయతీల పాలనపై అవగాహన అవసరం



నూజివీడులో నిర్వహించిన శిక్షణ తరగతిలో మాట్లాడుతున్న డీఎల్పీఓ సుందరి

నూజివీడు: పంచాయతీ కార్యదర్శులు, గ్రామ సచివాలయ సెక్రటరీలు పంచాయతీల పరిపాలన, ఆర్థిక వ్యవహారాల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని డీఎల్పీఓ సుందరి పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో మండలంలోని గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న గ్రేడ్-1 నుంచి గ్రేడ్-6 కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ తరగతిని నిర్వహించారు. డీఎల్పీఓ మాట్లాడుతూ ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని, పంచాయతీ సాధారణ నిధులతో వీధిలైట్లు, తాగునీటి ట్యాప్‌ల నిర్వహణ వంటివి చేపట్టాలన్నారు. ఇంటి పన్ను వసూళ్లను క్యూఆర్ కోడ్‌ను ఉపయోగించి నగదు రహితంగా వసూలు చేయాలన్నారు. ప్రతి సెక్రటరీ పంచాయతీ పాలనకు సంబంధించిన జీఓలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటికి అనుగుణంగా పంచాయతీ పాలనను నిర్వహించాలన్నారు. సెక్రటరీలు సచివాలయాల పరిధిలో అందుబాటులో ఉండాలన్నారు. ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఈఓపీఆర్డీ సరస్వతి పాల్గొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: గ్రామ పంచాయతీ విధులపై అవగాహన ఉండాలని ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లకు పంచాయతీ విధులపై నిర్వహించిన శిక్షణ తరగతులను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలో ఆర్థిక లావాదేవీలు, క్యాష్ బుక్ నిర్వహణ, పంచాయతీ తీర్మానాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎంపీడీఓ దుర్గాప్రసాదు, ఈఓపీఆర్డీ మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో..

ఆగిరిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని పంచాయితీ కార్యదర్శులకు శనివారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నూజివీడు డివిజనల్ పంచాయతీ అధికారి సుందరి గ్రామ పంచాయతీల సాధారణ పరిపాలన, ఆర్థిక వ్యవహారాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు.



చాట్రాయిలో మాట్లాడుతున్న దేశిరెడ్డి

ఎంపీడీఓ శంకరరావు, ఈఓపీఆర్డీ సీహెచ్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే అభివృద్ధి సాధ్యం

ఏపీ ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్



ఏకొండూరు మండలం రేపూడి తండాలో గిరిజనుల సమస్యలు తెలుసుకుంటున్న శంకర్‌నాయక్

తిరువూరు: గిరిజనుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, చదువుతోనే సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్ అన్నారు. తిరువూరు రెవెన్యూ డివిజన్లోని ఏకొండూరు మండలం రేపూడి తండాలో శనివారం ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. గతంలో ఎస్టీ, ఎస్సీలకు కలిపి ఒకే కమిషన్ ఉండేదని, గిరిజనుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తూ ముఖ్యమంత్రి ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేశారన్నారు. గిరిజన కుటుంబాలు సామాజిక అభివృద్ధి, గుర్తింపు సాధించాలంటే తమ పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు కేవలం ఉపశమనం కోసమేనని, విద్యావంతులైనపుడే అసలైన ప్రగతి సాధ్యపడుతుందన్నారు. బాలికా విద్యను నిర్లక్ష్యం చేయవద్దని కూడా సూచించారు. రేపూడి తండాలో సచివాలయం ఏర్పాటు, శ్మశానవాటికకు స్థల సేకరణ చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు. గ్రామంలో వివిధ అభివృద్ధి పనులకు రూ.కోటీ 70 లక్షల నిధులు కోరుతూ గతంలో పంపిన ప్రతిపాదనలపై తగు చర్యలు తీసుకుంటామన్నారు.

అధికారులతో సమీక్ష

రేపూడి తండాలోని ముత్యాలమ్మ గుడి వద్ద శంకర్ నాయక్ గ్రామస్తులతో, అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఎం రుక్మాంగదయ్య, గ్రామ సర్పంచ్ భూక్యా చంటి, ఎంపీడీఓ రవికాంత్, తహసీల్దారు సీహెచ్ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీహెచ్ సాయి వెంకటలక్ష్మి, పంచాయతీరాజ్ ఏఈ సీహెచ్ సాంబశివరావు, వైద్యాధికారి స్వామి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శివకుమారి పాల్గొన్నారు.

రక్త నమూనాలపై అవగాహన ఉండాలి



విద్యార్థులకు రక్త నమూనా పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మైలవరం: ప్రతి ఒక్కరూ రక్త నమూనాలపై అవగాహన ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు విజయవాడ ఆంధ్రా హాస్పిటల్ సౌజన్యంతో రక్త నమూనా పరీక్షలు శనివారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రమాదాలలో కాని ఇతర విపత్తులు సంభవించినపుడు ఇతరులకు సాయం చేయడానికి ముందుకు రావాలన్నారు. రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతులుగా ఉండటానికి ఆస్కారం ఉందన్నారు. తమ కళాశాలలో చేరిన విద్యార్థులకు అన్ని వివరాలతో కూడిన ఐడెంటిటీ కార్డులు ఇస్తామన్నారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బీ శివ హరి ప్రసాద్ మాట్లాడుతూ బ్లడ్ గ్రూప్ ఆవశ్యకతను వివరించారు. రెండు రోజులుగా జరిగిన ఈ శిబిరంలో 1,100 మందికి రక్త నమూనా పరీక్షలు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ వలంటీర్‌లు, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి ఎస్.ఉమామహేశ్వరరెడ్డి, ఆంధ్రా హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మధుమేహ వైద్యశిబిరం

తిరువూరు: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం తిరువూరులో మధుమేహ రోగుల ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు జేవీవీ పట్టణ అధ్యక్షుడు కే పాపారావు తెలిపారు. ఫ్యాక్టరీ సెంటర్లోని నాగార్జున స్కూలు ఆవరణలో ఆదివారం ఉదయం ఐదు నుంచి మధుమేహ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఇస్తారని పేర్కొన్నారు. ఈ శిబిరానికి హాజరయ్యేవారు ముందుగా బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకుంటే ఆ రిపోర్టులు తీసుకురావాలని కోరారు.

20న కొబ్బరి చెక్కల పోగుకు వేలం

విస్సన్నపేట: మండలంలోని పుట్రేలలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో ఒక సంవత్సరం వరకు కొబ్బరి చెక్కలు, వస్త్రాలు పోగు చేసుకునే హక్కునకు, భక్తులు సమర్పించిన తలనీలాలు పోగు చేసుకునేందుకు ఈ నెల 20వ తేదీన టెండర్ కం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కోటగిరి వెంకట సత్యశేష సునీల్‌కుమార్, ఈఓ యడ్లపల్లి సీతారామయ్య శనివారం తెలిపారు. ఆలయ ప్రాంగణం నందు దేవదాయశాఖ అధికారులు, ఆలయ ధర్మకర్తలమండలి సమక్షంలో వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు దేవస్థానం కార్యాలయం నందు సంప్రదించాలని తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అవార్డు



అవార్డును అందుకుంటున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి

మైలవరం: స్థానిక డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రభుత్వం నుంచి ఉత్తమ వనరుల సమీకరణ అవార్డు వచ్చినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి శనివారం తెలిపారు. 2022-2023 సంవత్సరంలో రూ.2.9 కోట్లు విలువైన తరగతి గదులు, డిజిటల్ సెమినార్ హాల్, డిజిటల్ లైబ్రరీ, డిజిటల్ క్లాస్‌రూమ్‌లు, అదనపు తరగతి గదులు, నూతన కంప్యూటర్ ల్యాబ్‌లను దాత డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి కళాశాలకు నిర్మించారని తెలిపారు. డాక్టర్ హనిమిరెడ్డి సహకారంతో ఈ అవార్డును అందుకున్నట్లు పేర్కొన్నారు. కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనరేట్ ప్రజ్ఞ వార్షికోత్సవం సందర్భంగా అనంతపురంలోని ఆర్ట్స్ కాలేజీలో డాక్టర్ పోల భాస్కర్, సీసీఈ, జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీ రంగ జనార్దన్ నుంచి ఈ అవార్డును అందుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

21న రక్తదాన శిబిరం

తిరువూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 21న తిరువూరులో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ యువజన విభాగం తెలిపింది. తిరువూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఉదయం 9.30 గంటలకు ఎమ్మెల్యే కే రక్షణనిధి ఈ శిబిరాన్ని ప్రారంభిస్తారని, రక్తదాతలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో 60 మంది ఎంపిక



క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఎంపికైన విద్యార్థులు

మైలవరం: మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ముత్తూట్ హౌసింగ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ సంస్థ వివిధ దశల్లో నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో కళాశాలకు చెందిన 60 మంది ఎంబీఏ విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు తెలిపారు. కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ మేనేజ్‌మెంట్ ట్రైనీ(సేల్స్) కోసం ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.3 లక్షల వేతనం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఆదిశేషారెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ డాక్టర్ సుజిత్‌కుమార్ రాత్, వేణుగోపాల్, కళాశాల ప్రెసిడెంట్ జీ. శ్రీనివాసరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు అభినందించారు.

రేపు సుబ్రహ్మణ్య షష్టి

గంపలగూడెం: గంపలగూడెం శివారు తోటమూలలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి మందిరంలో ఈ నెల 18న సుబ్రహ్మణ్య షష్టి నిర్వహించనున్నట్లు భక్తులు తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని కేతముక్కల అజయ్‌శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జగనన్న కాలనీలో మెరకపనులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలకు అనువుగా శనివారం మెరకపనులు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పాలడుగు దుర్గాప్రసాద్ దగ్గరుండి జేసీబీతో పనులు చేయించారు. మెరక పనులు పూర్తయితే తుమ్మలపాలెం, గుంటుపల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులు నూతన ఏడాదిలో గృహాల నిర్మాణానికి భూమి పూజ చేసుకునే విధంగా మెరక పనులు చేపట్టారు.

విశ్రాంత ఉద్యోగులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: విశ్రాంత ఉద్యోగులకు పింఛన్ సౌకర్యం కల్పించే విషయంలో డీఎస్ నకరా, సుప్రీంకోర్టు న్యాయమూర్తి వైవీ చంద్రచూడ్ చేసిన కృషి వెలకట్టలేనిదని, వారు పెన్షనర్‌దారుల పాలిట ఆపద్బాంధవులని సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ అన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని సమతా నగర్‌లో ఉన్న సంఘ కార్యాలయంలో 41వ అఖిలభారత పెన్షనర్స్ డే వేడుకలను అధ్యక్షుడు బీఎం సింగ్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ డీఎస్ నకరా, వైవీ చంద్రచూడ్‌ల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు పెన్షనర్లను సబ్‌కలెక్టర్ సన్మానించారు. ఆ తరువాత సబ్‌కలెక్టర్, డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్‌ను పెన్షనర్లు సత్కరించారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణ, నాయకులు స్టాన్లీ ప్రభాకర్, కేజేడీ రిచర్డ్, పీ మాధవరావు, ఏయూఎం దిలీప్, ఉప ఖజానాధికారి నాగమణి పాల్గొన్నారు.

ఆర్థిక క్రమశిక్షణ అలవరచుకోవాలి

తిరువూరు: జీవితంలో స్థిరత్వ సాధనకు ప్రతి ఒక్కరూ ఆర్థిక క్రమశిక్షణ అలవరచుకోవాలని కాకతీయ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ రవిబాబు అన్నారు. స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కాలేజీలో ఆర్థిక అక్షరాస్యతపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏ వృత్తిలో ఉన్నవారైనా తమ సంపాదనలో ప్రతి నెలా పొదుపు చేయడం తప్పనిసరని, అత్యవసర ఖర్చుల కోసం కొంత రిజర్వు నిధిని కూడా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో పొదుపు చేసే అలవాట్లను పెంపొందించడంతో పాటు ఆర్థిక క్రమశిక్షణ అలవర్చడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు తెలిపారు. వ్యక్తిగతంగా ఆర్థికాభివృద్ధి సాధిస్తే దేశ ఆర్థిక స్థిరత్వం సాధ్యమవుతుందన్నారు.

ఇంధన వనరులు కాపాడుకోవాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఈ నవీన్‌గౌతమ్

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): అవసరాలకు అనుగుణంగా అమూల్యమైన ఇంధన వనరులు పొదుపుగా వాడుకోవాలని ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ పి.నవీన్ గౌతమ్ అన్నారు. ప్రపంచ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా స్థానిక డీఏవీ పాఠశాలలో శనివారం ఇంధన వినియోగం, పొదుపుపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంధన పొదుపుపై విద్యార్థులకు వ్యక్తృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

సీఎస్ఐ చర్చి ప్రారంభం



విశ్వాసులను ఆశీర్వదిస్తున్న పీఠాధిపతులు

చాట్రాయి: మండలంలోని సూరంపాలెంలో పరిశుద్ధ పేతురు సీఎస్ఐ చర్చిని శనివారం దక్షిణ ఇండియా సంఘం కృష్ణా-గోదావరి అధ్యక్ష ఖండ పీఠాధిపతులు తంటెపూడి జార్జి కొర్నేలియస్ ప్రారంభించారు. అనంతరం విశ్వాసులను ఆశీర్వదించి రొట్టె ద్రాక్షారసాన్ని అందించారు. మధ్యాహ్నం సుమారు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, తంటెపూడి జాషువా కుమారి, అధ్యక్ష ఖండ కోశాధికారి తంటెపూడి రవికుమార్, అధ్యక్ష ఖండ సహాయ కార్యదర్శి డీడీ సుధాకర్, బిషప్ చాప్లైన్ ఐ.కరుణానిధి, డీనరీ చైర్మన్ గంటా ఆనందరావు, సంఘ కాపరి విమలయ్య మాస్టారు, వైఎస్సార్ సీపీ నాయకుడు కారంగుల వాసు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కళాకారుల ఆత్మీయ సమావేశం

విజయవాడకల్చరల్: తెలుగు కళావాహిని, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ, శ్రీ కళాభారతి సంస్థల ఆధ్వర్యంలో కళాకారుల ఆత్మీయ సమావేశం, సినీ సంగీత విభావరి కార్యక్రమాలను హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం నిర్వహించారు. తెలుగు అకాడమీ వ్యవస్థాపకుడు చిట్టిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం కళాకారుల కోసం కృషి చేస్తోందన్నారు. శ్రీ కళాభారతి అధ్యక్షుడు శింగంశెట్టి చంద్రశేఖర్ తమ సంస్థ ద్వారా పేద కళాకారులను ఆదుకుంటున్నట్లు తెలిపారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు



కేతకొండలో సెమీ క్రిస్మస్ వేడుకల్లో కొత్త సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించిన పాస్టర్లు



తిరువూరు సీఎస్ఐ చర్చిలో సెమీ క్రిస్మస్



గంపలగూడెంలో సెమీ క్రిస్మస్

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): సియోను మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో కేతనకొండ గ్రామంలో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. సంస్థ వ్యవస్థాపకులు పాస్టర్ మొగులూరు సురేష్‌బాబు ఏసుక్రీస్తు జన్మవృత్తాంతాన్ని వివరించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రిస్మస్ కేక్ కట్‌చేసి స్వీట్లు పంచారు. వృద్ధులకు నూతన వస్త్రాలు, చిన్నారులకు గిఫ్టులు అందజేశారు. కొత్త సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఎంపీటీసీ సభ్యుడు పులి సువర్ణరాజు, సంఘ పెద్దలు నాగరాజు, రత్న, రాణి పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరించాలి

తిరువూరు: ఏసుక్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని సీఎస్ఐ చర్చి తిరువూరు డీనరీ చైర్మన్ రెవరెండ్ జీ దైవ కృపావరం అన్నారు. తిరువూరు రాజుపేట సీఎస్ఐ చర్చిలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. క్రైస్తవులు శాంతి సామరస్యాలతో మెలగాలని, పేదలకు సేవ చేయాలని కృపావరం సూచించారు. రెవరెండ్ కే దిలీప్‌కుమార్, పాస్టర్ ఎస్ స్వర్లిన్, రెవరెండ్ ప్రసాద్, ప్రభుదాస్, తిరువూరు క్రిస్టియన్ కౌన్సిల్ చైర్మన్ గంటా జయంత్‌బాబు క్రిస్మస్ సందేశం ఇచ్చారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: స్థానిక లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్ ఆవరణలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. క్రిస్మస్ పర్వదిన ఆవశ్యకత తెలియజేస్తూ విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలిచ్చారు. ఏసుక్రీస్తు జననాన్ని తెలిపే నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. పాఠశాల వ్యవస్థాపకులు ప్రభాకర్, డైరెక్టర్ సురేష్, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి పర్యవేక్షించారు.

ముసునూరులో..

ముసునూరు: క్రీస్తు బోధనల ప్రకారం ప్రతి ఒక్కరూ ప్రేమ, శాంతి మార్గాల్లో జీవించాలని నూజివీడుకు చెందిన ప్రముఖ సువార్త ఉజ్జీవ ప్రసంగీకుడు పాస్టర్ కంబాల రాంబాబు పేర్కొన్నారు. మండలంలోని కొర్లగుంట కల్వరి స్నేహం మినిస్ట్రీస్ చర్చి ప్రాంగణంలో స్థానిక సంఘకాపరి, ముసునూరు మండల పాస్టర్స్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు డి.ప్రభుకిషోర్ ఆధ్వర్యంలో బి.ఏసుదాసు అధ్యక్షతన శుక్రవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఫెలోషిప్ గౌరవాధ్యక్షుడు బి.పురుషోత్తం, కోశాధికారి ఎం.రాజు, క్యాండిల్ సర్వీస్ నిర్వహించి, కేక్ కట్ చేసి, క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. 62 మంది వితంతువులకు చీరలు పంపిణీ చేశారు. సంయుక్త కార్యదర్శి బాలస్వామి, సభ్యులు జోజి, అబ్రహాంల ఆధ్వర్యంలో న్యూ ఇయర్ 2024 క్యాలెండర్‌ను విడుదల చేశారు.

ఎన్‌ఆర్‌ఐ కళాశాలకు జాతీయ స్థాయి గుర్తింపు



న్యూఢిల్లీలో అవార్డు అందుకుంటున్న ఎన్‌ఆర్‌ఐ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ సురేంద్రబాబు

ఆగిరిపల్లి: మండలంలోని పోతవరప్పాడులోని ఎన్‌ఆర్‌ఐ కళాశాలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం కళాశాల ప్రగతిని సూచిస్తుందని కళాశాల చైర్మన్ డాక్టర్ ఆర్.వెంకట్రావు తెలిపారు. న్యూఢిల్లీ హబి టాట్ సెంట్రల్‌లో జరిగిన డీజీ-100 సదస్సులో అడ్మినిస్ట్రేషన్, ట్రైనింగు, ప్లేస్‌మెంట్‌లో డిజిటల్ ఆన్‌లైన్ అనుసంధానం ద్వారా సేవలను తక్షణం విద్యార్థులకు అందించడం వలన ఎన్‌ఆర్‌ఐ కళాశాలకు డీజీ-100 ప్రతినిధుల ద్వారా ప్లేస్‌మెంట్ డైరెక్టర్ సురేంద్ర బాబు అవార్డు అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగ భాస్కర్, అకాడమిక్ డైరెక్టర్ సాంబశివరావు, డైరెక్టర్లు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సుధా సైన్స్ క్వెస్ట్

లబ్బీపేట(విజయవాడతూర్పు): నేటి బాలలే.. రేపటి ప్రపంచ సారథులు అని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల మ్యాథ్స్ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ బేబీరాణి అన్నారు. బాలలను విజ్ఞాన పథంలో నడిపించడంతో పాటు వారిలో ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్ ప్రదర్శనలు దోహదపడతాయన్నారు. మహాత్మాగాంధీరోడ్డులోని సెయింట్‌జాన్స్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో శనివారం నిర్వహించిన సుధా సైన్స్ క్వెస్ట్ ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బేబీరాణి మాట్లాడుతూ.. బాల్యదశలోనే వారిలో వైజ్ఞానిక కాంతులు వికసింప చేసి, పరిశోధనా రంగం వైపు అడుగులు వేయిస్తే దేశాభివృద్ధి తారాపథంలో నడుస్తుందన్నారు. ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ ప్రదర్శనలో 500 మంది విద్యార్థులు 450కి పైగా సైన్స్ ప్రాజెక్ట్ నమూనాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శనలకు బహుమతులు అందజేశారు. ప్రదర్శనలోని ఎర్త్‌క్వేక్ అలారం, రిమోట్ ఆపరేటెడ్ టాయిలెట్ ఫర్ పేషెంగ్, సైకిల్ వాషింగ్ మెషిన్, అగ్రికల్చర్ రోబోట్, గ్లూకోజ్ మానిటర్, వంటివి ఆకట్టుకున్నాయి. ఆయా తరగతుల వారీగా పి.సుగంధకుమార్, ఎస్‌పీహెచ్ కృష్ణంరాజు, జె.పాండురంగారావు, బి.శృతి, ఎస్‌కే ఇస్మాయేల్ అలీబాషా, జి.శకుంతల, షేక్ ఖాజా ముస్వరీన్, ఉదయ్‌కుమార్, రవిశంకర్, ప్రభాకరరావులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రెసిడెంట్ టి.మోనికా సుమన్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సుమన్ త్యాగరాజ్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ వీఐటీ ప్రొఫెసర్ డాక్టర్ సునీల్‌కుమార్, ప్రిన్సిపాల్ సీహెచ్ భారతి, అకడమిక్ కో-ఆర్డినేటర్ బి.పావని తదితరులు పాల్గొన్నారు.